ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లు ప్రజలను వేధించడం మానాలి


మహిళలతో మాట్లాడి వారి ఫిర్యాదులు వింటున్న ఎమ్మెల్యే

గోల్కొండ: ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లు వినియోగదారులను వేధించడం మానుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన షేక్‌పేట్, విజయ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలను సందర్శించారు. షేక్‌పేట్ నాలా వద్ద గల మాధవీ ఎల్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చారు. అక్కడ ఉన్న మహిళలు ఆయన వద్దకు వెళ్లి మాధవీ గ్యాస్ ఏజెన్సీ అక్రమాలను, గ్యాస్ రిఫిలింగ్ కోసం ఏజెన్సీ వారు సతాయిస్తున్న తీరును ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాధవి గ్యాస్ ఏజెన్సీపై సుదీర్ఘ కాలం నుంచి ఎన్నో ఫిర్యాదులు ఉన్నాయని అక్రమంగా వీరు గ్యాస్ సిలిండర్‌లను బ్లాక్‌లో అమ్ముకుంటున్న ఫిర్యాదులు కూడా వచ్చాయన్నారు. కొంత కాలం క్రితమే తాను పౌర సరఫరాల శాఖ అధికారులకు మాధవి గ్యాస్ ఏజెన్సీ అక్రమాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసిన అధికారులు మాధవి గ్యాస్ ఏజెన్సీ అక్రమాలను అడ్డుకట్ట వేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. పక్కా కమర్షియల్‌గా వ్యవహరిస్తూ మాధవి గ్యాస్ డీలర్ ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. మాధవి గ్యాస్ ఆగడాలపై తాను పౌర సరఫరాల కమిషనర్‌ను కలుస్తానని తన వెంట మాధవి ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులను సైతం తీసుకువెళ్తానని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీల వినియోగదారులకు సరైన సమయంలో గ్యాస్ రిఫిలింగ్ చేయడం లేదని ఆయన అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, బదరుద్దీన్ తదితరులున్నారు.

‘ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తుంది’


ఆర్టీసీ బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు కృష్ణ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల ఆరు హామీలను కచ్చితంగా అమలు చేస్తుందని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మెహిదీపట్నం, ఆసీఫ్‌నగర్ చౌరస్తా, మాసాబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా బస్టాప్‌ల వద్ద మహిళా ప్రయాణికులను కలుసుకున్నారు. మహిళలకు బస్సు ఉచిత ప్రయాణం కల్పించడంపై ఆయన మహిళల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు నిశ్చింతగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్ హమీద్, జి.కిషన్, హబీబ్ తదితరులున్నారు.

మహిళల్లో బాక్సింగ్‌పై పెరుగుతున్న ఆదరణ


పోటీలను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి

గోల్కొండ: మహిళల్లో బాక్సింగ్‌పై ఆదరణ పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ఇండియన్ రైల్వే బోర్డు సభ్యురాలు ఉమారాణి అన్నారు. షేక్‌పేట్ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 7వ ఎలైట్ మహిళా రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లు జరిగాయి. ఈ పోటీలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పదేళ్లుగా బాక్సింగ్ రంగంలో మహిళలు ఎందరో దూసుకువచ్చారన్నారు. ఈ టోర్నమెంట్ విజేతలకు ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు జరిగే జాతీయ బాక్సింగ్ పోటీలకు అర్హత సాధిస్తారని బీవీఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్, నవభారత్ అసోసియేషన్ అధ్యక్షులు బి.వినయ్, వనిత అన్నారు. వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాఘవరెడ్డి, తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బాబురావు, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి మహేష్, తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి రవీందర్, ప్రముఖ బాక్సర్ నికత్ జరీన్ తండ్రి జమీల్, బీజేపీ నాయకులు ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు


సమస్యలపై స్థానికులతో ఆరా తీస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: బస్తీలలో పర్యటిస్తూ స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నమని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. మంగళవారం ఆయన రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో పాటు అధికారులతో కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలోని బస్తీల్లో పర్యటిస్తూ స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు సూచిస్తున్నామన్నారు. ఈ పర్యటలో జీహెచ్‌ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ డీసీ నరసింహ, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ ఇర్షాద్ ఇక్బల్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రోహిణికి ఉత్తమ ప్రతిభా అవార్డు


డాక్టర్ రోహిణికి అవార్డు అందజేస్తున్న డాక్టర్ శశికళరెడ్డి తదితరులు

అబిడ్స్: గైనకాలజీ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచిన డాక్టర్ రోహిణికి ఉత్తమ ప్రతిభ అవార్డు లభించింది. ఉస్మానియా మెడికల్ కాలేజ్ పూర్వ విద్యార్థుల వేడుకల సందర్భంగా డాక్టర్ రోహిణికి అవార్డు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గైనకాలజీ విభాగంలో మెరుగైన వైద్యం అందించేందుకు జీవితాంతం తన వంతు కృషి చేస్తానన్నారు. మహిళలకు విశేష సేవలు అందించేందుకు అహర్నిశలు అందుబాటులో ఉంటానన్నారు. ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, తిరుపతి వెంకటేశ్వర మెడికల్ కళాశాల వైస్ ఉపకులపతి డాక్టర్ ఆర్.వి.కుమార్, ఉస్మానియా మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ శశికళరెడ్డి, ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీధర్‌లు డాక్టర్ రోహిణికి అవార్డు అందజేసి అభినందనలు తెలిపారు.

ధీరజ్ సాహూ అవినీతిపై కాంగ్రెస్ అగ్రనేతలు స్పందించాలి


నిరసన తెలియజేస్తున్న బీజేపీ నేతలు

నాంపల్లి: జార్ఖండ్ ఎంపీ ధీరజ్ సాహూ అవినీతిపై కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే స్పందించాలని నాంపల్లి నియోజకవర్గం బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి జేఎల్.రాహుల్‌చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం లక్డీకాపూల్ చౌరస్తాలో ధీరజ్ ఎంపీ సాహూ అవినీతిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం జేఎల్.రాహుల్‌చంద్ర మాట్లాడుతూ..కాంగ్రెస్ అంటేనే అవినీతి, కాంగ్రెస్ అంటేనే లూటీ అంటూ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఇంట్లో అతిపెద్ద మొత్తంలో నగదు సీజ్ చేసినా కాంగ్రెస్ అగ్రనేతలు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు భుజందర్‌రావు, కాంతి కిరణ్, రజినీ, కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య

విజయనగర్‌కాలనీ: భర్త వేధింపులు తాళలేక ఉరివేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ మురాద్‌నగర్‌కు చెందిన షేక్ రసూల్ తనతో వివాహమైన విషయాన్ని దాచిపెట్టి అర్షియాబేగం (23)ను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇదిలా ఉండగా మగ సంతనాం కలుగలేదని తరచూ మద్యం తాగి వచ్చి భార్యను హింసించేవాడు. ఇతని వేధింపులు తట్టుకోలేక అర్షియాబేగం ఈనెల 11న అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదపుటంచుల్లో పర్యాటకులు

- నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్న చార్మినార్ సెక్యూరిటీ సిబ్బంది
- పట్టించుకోని ఆర్కియాలజీ అధికార యంత్రాంగం
- గత సంఘటనల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి


చార్మినార్‌పై అంతస్తు పిట్టగోడ వద్ద సెల్ఫీలు దిగుతున్న సందర్శకులు (ఫైల్)

చార్మినార్: చార్మినార్ కట్టడం మొదటి అంతస్థులో సందర్శకులు ప్రమాదపుటంచులోకి వెళ్తున్నారు. పిట్టగోడలకు అతి సమీపంలోకి వెళ్లకుండా పర్యాటకులను అడ్డుకోవాల్సిన సెక్యూరిటీ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది సెక్యూరిటీ సిబ్బంది విధినిర్వహణను పక్కన పెట్టి చార్మినార్ పరిసరాల్లోని బంగారం, వెండి, ముత్యాల ఆభరణాల క్రయవిక్రయాలపై దృష్టి సారిస్తున్నారు. ఆయా ముత్యాల దుకాణాల యజమానుల వద్ద నుంచి వీరికి కమీషన్లు అందుతుండడంతో వారి అడ్రస్‌తో కూడిన విజిటింగ్ కార్డులను సందర్శకులకు అందించి అక్కడికి పంపుతున్నారు. దీంతో పర్యాటకులు ప్రమాదపుటంచులోకి తొంగిచూస్తున్నారు. చార్మినార్ కట్టడంపైన సందర్శకులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. నగర అందాలను తిలకించాలనే ఉత్సాహంలో భద్రతను విస్మరిస్తున్నారు. సెల్ఫీల మోజులో హద్దుమీరుతున్నారు. కట్టడంలోని పైఅంతస్తు పిట్టగోడ వద్దకు వెళ్లకుండా నిరోధించాల్సిన చార్మినార్ కట్టడం సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. సందర్శకులను పిట్టగోడ దగ్గరగా వెళ్లకుండా అడ్డుకోవాల్సిన చార్మినార్ కట్టడం సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు సకాలంలో స్పందించకపోవడంతో కొంత మంది సందర్శకులు యథేచ్ఛగా పిట్టగోడ వద్దకు వెళ్లడమే కాకుండా ప్రమాదకరంగా దానిపై కూర్చొని ఫొటోలు దిగుతూ.. కిందికి తొంగి చూస్తున్నారు.

గతంలో చోటు చేసుకున్న ఘటనలు..

- చార్మినార్ కట్టడం పైఅంతస్తు పిట్టగోడ పైనుంచి దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఒకే కుటుంబానికి చెందిన అక్కా చెల్లెలు కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరు చార్మినార్ కట్టడం సందర్శన కోసం వచ్చి ఇలా మూకుమ్మడిగా ఆత్మహత్యకు పాల్పడిన ఈ సంఘటనతో కొన్నేళ్లుగా చార్మినార్ సందర్శనను నిలిపివేశారు.
- తగిన భద్రతా చర్యలు తీసుకున్న అనంతరం తిరిగి సందర్శకులను చార్మినార్ కట్టడంపైకి అనుమతించారు.
- అనుమతించిన అనంతరం కూడా మరో సంఘటన చోటు చేసుకుంది.
- చార్మినార్ కట్టడంపై నుంచి నగర అందాలను వీక్షిస్తున్నట్లు నటించిన ఒక యువకుడు ఆకస్మాత్తుగా తనతో వచ్చిన యువతిని కిందికి తోసేశాడు. దీంతో ఆ యువతి అక్కడికక్కడే మరణించింది.
- మరో సంఘటనలో మతిస్థిమితం కోల్పోయిన ఓ యువకుడు ఆకస్మాత్తుగా లాడ్‌బజార్‌వైపు ఉన్న చార్మినార్ మొదటి అంతస్తు నుంచి కిందికి దూకే ప్రయత్నం చేయగా పోలీసులు రక్షించారు.
- ఇలా ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకునే అవకాశాలున్నందున తగిన ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
- చార్మినార్ కట్టడంపైన విధినిర్వహణలో ఉన్న సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేసి వారిపై నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.

నిరుపయోగంగా బారికేడ్లు..

పిట్టగోడల వద్దకు దగ్గరగా వెళ్లకుండా ఉండేందుకు గతంలో గొలుసులతో కూడిన బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ బారికేడ్లను పక్కకు జరుపుతుండటంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. దీనికి తోడు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని బందో బస్తులో నియమించినప్పటికీ.. చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ పరిస్థితులను చక్క దిద్దాల్సిన అవసరముందని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లను ఇవ్వాలి

గన్‌ఫౌండ్రీ: ఇంటర్ నుంచి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లను అందించి బస్సుల సంఖ్యను పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ జిల్లా ఉపాధ్యక్షుడు మాలోతు శ్రీమాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం నిజాం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఎన్నికలలో ఇచ్చిన కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఇప్పటి నుంచి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు నిజాం కళాశాల సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం



చార్మినార్: ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దామోదర రాజనర్సింహను చార్మినార్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీతో పాటు సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి ఘనంగా సన్మానించారు.

ఈ-పెట్టీ కేసులో వ్యక్తికి జైలు

అబిడ్స్: పోలీస్ నిబంధనలను ఉల్లంఘించిన ఓ వ్యక్తికి 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. షేక్‌పేట దర్గాకు చెందిన ఎం.వీరబాబు నిబంధనలను ఉల్లంఘించడంతో గుడిమల్కాపూర్ పోలీసులు అతనిపై ఈ-పెట్టీ కేసును నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ తెలిపారు. 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి సత్యనారాయణ ఈ-పెట్టీ కేసులో వీరబాబుకు నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రజలంతా సత్ప్రవర్తనతో మెలగాలని, నిబంధనలను పాటించాలని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

అక్కినేని ప్రతిభా పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నేటి తరం నటీనటులకు ఆదర్శప్రాయుడని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో యువకళావాహిని ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతిని పురస్కరించుకుని పలువురు సినీ దర్శకులకు అక్కినేని దర్శక ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు అక్కినేని చిత్ర గీతావిభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు కోదండ రామిరెడ్డి, రేలంగి నర్సింహారావు, ముత్యాల సుబ్బయ్య, సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు, నిర్మాతలు ఎస్‌ఆర్.అనురాధదేవి, జివి.నారాయణరావు, యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అక్కినేని పురస్కార గ్రహీతలతో జస్టిస్ శేష శయనారెడ్డి

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల సంక్షేమం


మంత్రి శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న సతీష్‌కుమార్ తదితరులు

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం జరుగుతుందని నగర మార్కెటింగ్ మాజీ డైరెక్టర్, గోషామహల్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు టి.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర నూతన మంత్రి డి.శ్రీధర్‌బాబును ఆయన ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. అన్నివర్గాల ప్రజలు దొరల పాలనను అంతమొందించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీరాలంమండిలో ప్రత్యేక పూజలు


చండీహోమంలో పాల్గొన్న గాజుల అంజయ్య, చంద్రకళ దంపతులు

చార్మినార్: కార్తీక మాసం చివరి రోజైన అమావాస్యను పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా గణపతి అభిషేకం, గణపతి గరిక సహస్ర నామ అర్చన, అమ్మవారికి అభిషేకం, శ్రీ చక్ర అర్చన అనంతరం చండీహోమం జరిగింది. ఈ హోమం కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య-చంద్రకళ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని గాజుల అంజయ్య తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బహదూర్‌పురా: జహనుమాలోని సెయింట్ మార్క్ బాయ్స్‌టౌన్ స్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు క్రీస్తు జననంపై నాటక ప్రదర్శనలు చేశారు. క్రిస్మస్ సందర్భంగా నిర్వహించే క్యారల్స్ పాటలను ఉత్సాహంగా విద్యార్థులు పాడుతూ అలరించారు. వివిధ వేషధారణలతో విద్యార్థులంతా సంతోషంగా గడిపారు. రెవరెండ్ ఫ్రాన్సిసిస్ట్ క్రీస్తు జననం విశిష్టతను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బాయ్స్ టౌన్ డైరెక్టర్ బ్రదర్ ప్రభాకరన్, థామస్, ప్రిన్సిపాల్ షౌరెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ సాధనకు టీఎన్జీఓస్ కృషి


మంత్రిని సత్కరిస్తున్న జగదీశ్వర్, ముజీబ్ హుస్సేని, కస్తూరి వెంకట్

అబిడ్స్: బంగారు తెలంగాణ సాధనకు టీఎన్జీఓస్ కేంద్ర సంఘం, హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ సంఘాలు నిర్విరామంగా కృషి చేస్తాయని కేంద్రసంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. టీఎన్జీఓస్ కేంద్ర సంఘంతో పాటు హైదరాబాద్ జిల్లా, రంగారెడ్డి జిల్లా ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులందరూ విశేష కృషి చేస్తారన్నారు. నూతన మంత్రి శ్రీధర్‌బాబును వారు ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ..రానున్న రోజుల్లో తమ టీఎన్జీఓస్ యూనియన్లు ప్రభుత్వానికి పూర్తిగా సహకారాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి వెంకట్, సత్యనారాయణగౌడ్, రామనేని శ్రీనివాస్, లక్ష్మణ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కె.వెంకటేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ గొప్పతనాన్ని..అమ్మవారి మహత్యాన్ని మంత్రికి వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: సంక్రాంతి పర్వదిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలోన్ని సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు యోగా సంగీత నృత్య గురువులు, కవులు, రచయితలకు సంక్రాంతి పురస్కారాలు అందజేయనున్నట్లు సర్వేజన సుఖినోభవంతు సంస్థ అధ్యక్షుడు ఈఎస్‌ఎస్ నారాయణ మాస్టార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారి వారి సేవలను గుర్తించి సంక్రాంతి విశిష్ట ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను సంస్థ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 96523 47207లో సంప్రదించాలని సూచించారు.

రాములు సాగర్‌కు ఘన నివాళి



గోల్కొండ: ప్రముఖ సంఘ సేవకుడు రాములు సాగర్ సంతాప సభ మంగళవారం గుడిమల్కాపూర్‌లోని వనం ఝాన్సీ కమ్యూనిటీహాల్‌లో జరిగింది. శివరాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంతాప సభలో రాములుసాగర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జాతీయ నాయకులు బద్దం మహిపాల్‌రెడ్డి, నాయకులు దేవర వంశీ, వాసుదేవ్‌యాదవ్, బోడి అశోక్‌కుమార్ యాదవ్, మురళీకృష్ణగౌడ్, నామ యాదగిరి, సందేష్ యాదవ్, కెప్టెన్ యాదగిరి తదితరులున్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి


ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజరీ

గోల్కొండ: అధికారికంగా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు ప్రొటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజరీ అన్నారు. తెలంగాణలో అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఈ విషయాన్ని బల్దియా, వైద్య శాఖ అధికారులతో పాటు జలమండలి అధికారులు కూడా గుర్తు పెట్టుకోవాలని ఆయన సూచించారు. కొత్త పథకాల అమలు, వాటి ప్రారంభోత్సవం వివరాలను కాంగ్రెస్ కార్వాన్ ఇన్‌చార్జిగా ఉన్న తనను ఇప్పటి వరకు ఏ అధికారికి కూడా స్పందించలేదని ఆయన అన్నారు. నియోజవర్గానికి మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారని ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్వాన్ ఇన్‌చార్జితో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులను సైతం ఆహ్వానించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిమితి పది లక్షలకు పెంచిన కార్యక్రమాన్ని ఆదివారం అధికారులు ప్రారంభించారని ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

అల్పాహారం పంపిణీ


అల్పాహారం పంపిణీ చేస్తున్న లక్ష్మణ్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రార్థించే పెదవులకన్నా సహాయం చేసే చేతులు మిన్నా అన్న చందంగా బజరంగ్ సేనా సమాజ సేవలో ఎంతో ముందడుగు వేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్.లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. మృగశిర అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం కోఠి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజ హితం కోసం ఏర్పడిన తమ సంస్థ ధర్మం కోసమే కాకుండా పేద ప్రజల సహాయం కోసం ప్రతి నిత్యం పాటుపడుతుందన్నారు. బజరంగ్ సేనా రాష్ట్ర నాయకులు సూర్య శుక్లా, శ్రీనివాస్ గుప్తా, మనోజ్, రాఘవ కుమార్ శ్రీనివాస్, గణేష్ సింగ్ పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ప్రతి నెలా నిర్వహించే అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం గౌలిపురా బతుకమ్మ బావి వద్దనున్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు చీల రాములు గుప్తా, అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్, కోశాధికారి కొల్కూరి నర్సింహులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతి, సభ్యులు ముక్క శేఖర్, గౌరిశెట్టి సంతోష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



సుల్తాన్‌బజార్: చరిత్ర పురాతన అంశాలు, మన పూర్వీకుల జీవన విధానంపై విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించేందుకు ఫిలాటిలిక్ అండ్ హాబీస్ సొసైటీ నిర్వాహకులు హైపెక్స్ డైమండ్-2023 పేరిట ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు సొసైటీ కార్యదర్శి సాగి శ్రీనివాస్‌రాజు తెలిపారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎస్‌ఎస్‌ఎస్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1961లో ఏర్పడిన తమ సంస్థ ఇప్పటి వరకు వందల కొద్దీ ప్రదర్శనలు నిర్వహించిందని వివరించారు. పాత నాణేలు, స్టాంపులను సేకరించే అభిరుచి కలిగిన ఎంతోమందిని ఒక వేదిక మీదకు తీసుకువచ్చేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాణేల సేకరణ అభిరుచి కలిగిన వ్యక్తులు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో వందల ఏళ్ల నాటి నాణేలు, స్టాంపులను వీక్షించడమే కాకుండా ఆసక్తి ఉన్నవారు కొనుగోలు చేయవచ్చన్నారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్ నాంపల్లి రెడ్ హిల్స్‌లోని ఫ్యాప్సీభవన్‌లో ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

బావ చేతిలో బావమరిది హతం

చాంద్రాయణగుట్ట: కటింగ్ షాపులో బావ బావమరుదుల మధ్య జరిగిన గొడవలో బావమరిదిపై బావ కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేసిన ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులల వివరాల ప్రకారం..బిహార్‌కు చెందిన మహ్మద్ పప్పు (33), తస్వీర్ అలీ (40)లు బావ, బామ్మర్దులు. కొన్నేళ్ల క్రితం బండ్లగూడ నూరీనగర్‌కు వలస వచ్చారు. బావ బావమరుదులిద్దరికి ఫూల్‌బాగ్ జీఎం చావునీలో కటింగ్ షాపు దుకాణాలు ఉన్నాయి. ఇందులో కార్మికులుగా బిహార్‌కు చెందిన వారు పని చేస్తున్నారు. ఈ బిహారి కార్మికులు బావ వద్ద కొన్ని రోజులు బావమరుదుల వద్ద కొన్ని రోజులు పని చేస్తుండటంతో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. ఈ విషయంలో తరచూ ఇద్దరి మధ్య గత కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం మరోసారి వీరి మధ్య గొడవ జరిగింది. కోపోద్రేక్తుడైన మహ్మద్ పప్పు తస్వీర్ అలీపై కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684